# రాజ్యాంతే నరకం ధ్రువం!

## ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧.

కాశ్మీర రాజధాని శ్రీనగరంలో అప్పు డప్పుడే ఉదయిస్తున్న సువర్ణ సూర్యకాంతులలో జగదీశ్వరాలయమంతా ఒక సహస్రదళపద్మంలా మెరిసిపోయింది. ఆ నిశ్శబ్ద సూర్యోదయవేళలో దేవాలయ ఘంటాధ్వనులు మంద్రమంద్రంగా మారు మోగుతున్నాయి.

కాశ్మీర యువరాజు గోపాలవర్మ జగ ద్ధాత్రీ దేవి పూజ ముగించుకొని జగదీశ్వరా లయమండపం ఎదట అలాగే నిలబడి పోయాడు. అతడెక్కివచ్చిన పంచకల్యాణి పక్కనే సిద్ధంగా నిలబడిఉన్నది. మరుక్ష ణంలోనే అతడక్కడినుంచి తిరిగి వెళ్ళి పోవచ్చునని అర్చకులందరు మనసారా ఆశిం చారు. కాని అది జరగలేదు. గోపాలవర్మ అలాగే పంచకల్యాణి పక్కనే నిలబడి గాఢంగా ఏదో ఆలోచించాడు. అర్చకు లంతా అతనికెదురుగా దోసిలు లొగ్గి నిలు చున్నారు.

"అమ్మవారి ఆభరణాలన్నీ ఏమైపోయాయి? ఒక్కటీ కనబడదేమి?" అని గద్దించి అడిగాడు గోపాలవర్మ.

అర్చకులంతా తలలు వంచేసుకున్నారు. వారిలోఒక వృద్ధుడుమాత్రం తలవంచుకో లేదు.

"ఏం! ప్రత్యుత్తరం ఇవ్వదలుచుకో లేదా?"

మళ్ళీ గర్జించాడు గోపాలవర్మ. వృద్ధుడు "మహా ప్రభూ! బందిపోటు దొంగలు ఆభరణాలన్నీ దోచుకుపోయారు." అన్నాడు. గోపాలవర్మ నిర్ఘాంతపోయాడు.

"ఎంతకాలం అయింది!"

"ఒకమాసం కావచ్చింది."

"దొంగలు దొరకలేదా?"

"లేదు"

"మహామాత్యులకీవిషయం తెలిసిందా?"

"మేమంతా ఈ మధ్యనే వారిని సందర్శించి వచ్చాము. వారిది వినీవినట్లుగా మాట్లాడ సాగుతున్నారు."

వృద్ధుడు చెప్పిన ప్రత్యుత్తరం [illegible] గోపాలవర్మ ఒక్క ఊపుతో పంచకల్యాణి మూపుపై కూర్చున్నాడు.

వృద్ధుడిచ్చిన సమాధానంతో అర్చకు లందరికీ తిరిగి ప్రాణాలు కుదటపడ్డాయి. వెంటనే గోపాలవర్మ పంచకల్యాణి మహా మాత్యునిభవనంవైపు దౌడు తీసింది.

జగదీశ్వరాలయం గోపాలవర్మ పితా మహుడు అవంతి వర్మ నిర్మింపజేసిన శైవ దేవాలయం. ఆలయ ప్రతిష్ఠ జరిగిన కాలంలో అది శ్రీ నగర దేవాగారాలన్నిటి లోకీ మకుటాయమానంగా ఉన్నదని పౌర జానపదులు పరమానంద భరితులైనారు. నాటినించీ ఆ ఆలయంలో నిత్యార్చనాది వ్యవహారాలన్నీ యథావిధిగా కొనసాగిపోతున్నాయి. అంతఃపురంలోని మహారాణు లెందరో అమ్మవారి కెన్నెన్నో అమూల్యాభరణాలు సమర్పించారు. ప్రత్యే కంగా గోపాలవర్మ పితామహి అవంతివర్మ పట్టపుదేవి జగద్ధాత్రీదేవి పాదాలకు రత్న మంజీరాలు సమర్పించింది. పితామహుడు అవంతివర్మ ఆ దేవికి సువర్ణపాద పీఠిక సమ ర్పించాడు. ఇలాగ కాశ్మీర రాజవంశీయు లందరు ఆదేవి కెన్నెన్నో ఆభరణాలు సమ ర్పించారు.

ఆనాడు యువరాజు గోపాలవర్మ జన్మ దినోత్సవం. సూర్యోదయానంతరమే జగ ద్ధాత్రీజగదీశ్వరులను సేవించుకోవాలని గోపాలవర్మ ఆ దేవాలయ గర్భగుడిలో ప్రవేశించాడు. అతని కెదురుగా ఆభరణాలు లేని వట్టి శిలాప్రతిమలు మాత్రమే ప్రత్యక్ష మైనాయి! అతని కళ్లకు చీకట్లు కమ్మకున్న ట్లయింది. ఎలాగో అలాగ పూజ ముగించు కొని ఇవతలికి వచ్చివేశాడు.

కాశ్మీరరాజధాని శ్రీనగరమధ్యంలోనిర్మిం చిన శైవదేవాలయంలో పట్టపగలే చౌర్యం జరిగిపోయింది! అది జరిగి దాదాపు ఒక మాసం కావచ్చింది. అయినా ఆబంది పోటు దొంగ లెవరో పట్టుబడలేదు! దండ నాయకులు, సేనానాయకులు, మహామా త్యులు మొదలైన మహామహులంతా ఏమై నారు? సుఖంగా మృష్టాన్నం భుజించి నిద్ర మత్తులో మునిగిపోయారా? ఎంతటి మహా ప్రమాదం! ఎంతటి అపచారం!

యువరాజు హృదయంలో ఈ విధమైన ఆలోచనలెన్నో పొంగి పరవళ్లు తొక్కాయి. ఆ పైన దానికి అతని ఉడుకురక్తంకూడా తోడైంది. గోపాలవర్మకీజన్మదినోత్స వంతో నిండినవి ఇరవైఏళ్ళు.

ఆ ఉడుకురక్తం ఉద్ధృతంలో గోపాల వర్మ శరవేగంతో మహామాత్యుని భవంతి సింహద్వారం సమీపించాడు. వెంటనే అక్కడి ద్వారపాలకులా వార్త మహామా త్యుని కందజేశారు. ఆతడా వార్తవిని నిర్ఘాం తపోయి నిలుచున్నపాటుగా సింహద్వారం సమీపించి రాజోచిత మర్యాదలతో యువ రాజును భవంతిలోపలికి తీసుకుపోయాడు. అతని ధోరణి కొంచెం పరిశీలించగానే మహామాత్యునికేవో పెద్ద అవాంతరమే వచ్చి ఉండవచ్చునని అనుమానం తగిలింది. అందు చేత మంత్రి యువరాజు ననేకవిధాల రాజోపచారాలతో శాంతింపజెయ్యాలని శాయశక్తులా ప్రయత్నించాడు. అయినా యువరాజు ముఖంలో ప్రసన్నత స్ఫురించలేదు.

మార్గాంతరంలేక మంత్రి కొంతసేపటికి గోపాలవర్మను నెమ్మదిగా ప్రసంగంలోనికి దింపాడు. గోపాలవర్మ అలాగే రుసరుస లాడుతూ తీవ్రంగా ఇలా గడిగాడు:

"ఇంతకీ శ్రీనగర దండనాథులంతా ఏమై పోయారు?"

"చేతనైనంతవరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని ఎక్కడా ఆ దొంగలజాడ పొడగట్టనేలేదు!"

"ఎంత అసమర్థత! శ్రీనగర మధ్యంలో శివాలయంలో పట్టపగలే చౌర్యం జరిగింది! మాసం గడచినా చోరులు పట్టుబడలేదు! తమకేమీ ఇది పట్టినట్లే కనబడలేదు!" అన్నాడు యువరాజు దురుసుగా.

"పిలిచినవారంత ఆగ్రహిస్తే నేనేమి విన్నవించగలను! నేనున్నూ రాత్రింబగళ్లే

ని|ద్రాహారాలు విడిచి చెయ్యగలిగినన్ని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నించినా మరి నాకు శక్యం కాలేదు." అన్నాడు మంత్రి.

"అలాంటప్పుడు సమర్థుల కెవరికైనా తమ పదవి అప్పగించడం మంచిదేమో!" అన్నాడు గోపాలవర్మ.

మంత్రి ఈ మాటతో లోపల మండిపడిపోయాడు. నలభై ఏళ్ళుగా నిర్వహిస్తున్న మహామాత్య పదవికి నాడు ఆ సామర్థ్యదోషం పట్టిందే అని లోలోపల ఎంతైనా కుంగిపోయాడు. రాజసేవ బాగుబాములతో చెలగాటమే అని అతనికి తెలుసును. అయినా లోలోపలి కోపం అంతా అణచివేసుకుని పైకొక చిరునవ్వు నవ్వి బింకంగా ఇలాగన్నాడు. "తమకింకా ముక్కు పచ్చలారలేదు! ఈ రాజ్యకార్య నిర్వహణలో లోతులింకా తమకు తెలియవు! మరి తమకు నేనేమని మనవి చెయ్యగలను!"

ఈ సమాధానంతో యువరాజు కన్ను లెర్రబడ్డాయి.

"తమ రెవరితో ప్రసంగిస్తున్నారో మరిచిపోయినట్లున్నారు!" అన్నాడు ఆవేశంతో.

"తమ దయవల్ల నా కింకా అంతటి మరుపు రాలేదు! నేను కాశ్మీర యువరాజులు శ్రీ శ్రీ శ్రీ గోపాలవర్మ ప్రభువర్యులతో ప్రసంగిస్తున్నాను." అన్నాడు మహామాత్యుడు అంతకన్నా బింకంగా!

"ఓహో! అలాగా! అయితే సూర్యాస్తమయానికి పూర్వమే ఆ బందిపోటు దొంగల తల లెగిరిపోయి తీరాలి!" అన్నాడు కాశ్మీర యువరాజు.

"అందుకు సందేహమా! నిరభ్యంతరంగా ఎగిరిపోతాయి! ఆ బందిపోటు దొంగలను అంతగా వెతికివెతికి పట్టుకోవలసిన అవసరం కూడా లేదు. వారంతా మన కాశ్మీర సైన్యంలో యోధులే!" అన్నాడు మంత్రి. యువరాజు నిర్ఘాంతపోయాడు.

"అయితే ఈ దురంతాలన్నీ మీ ఎరుకలోనే జరుగుతున్నాయన్నమాట!"

"నా ఎరుకలో జరగనిదేమిటి మహాప్రభూ! నేనే స్వయంగా చేయిస్తున్నాను!"

"ఆఁ! అయితే జగదీశ్వరాలయం బందిపోటు దొంగల పేరుతో కొల్లకొట్టించింది మీరేనా?"

"అవును!"

"కాశ్మీర రాజ్యంలో ప్రజ హాహాకారాలు చేస్తున్నా, భరింపరాని పన్నుల భారంలో కుంగిపోతున్నా, కొత్త పన్నులు విధించి పీడిస్తున్నవారు మీరేనన్న మాట!"

"అవును. నిజమే! ఇంత స్పష్టంగా విప్పి చెప్పినా ఇంకా ఎందుకలా ప్రశ్నిస్తున్నారో నాకవగతం కావడం లేదు! కనుకనే మీకీ రాజ్య వ్యవహారాల లోతులు బాగా తెలియవని మనవి చేసుకొన్నాను" అన్నాడు మహామాత్యుడు. ఆపైన హేళనగా ఒక్క విషపునవ్వు నవ్వాడు.

గోపాలవర్మ ఇంకా ఆ విషపునవ్వు ఆఘాతంలోనించి కోలుకోలేదు. అలాగే నిశ్చలంగా మంత్రి కేసి చూసి—"ఈ అధికారం మీ కెవరిచ్చారు?" అన్నాడు.

"ఇది వెల్లడించడానికి వీలులేదు!"

"వెల్లడించక తప్పదు!"

"రహస్యభంగం చెయ్యనని వాగ్దానం చేస్తే మనవి చేస్తాను." ఈ మాటతో గోపాలవర్మ నోట మాట రాలేదు.

తర్వాత ఒక్క నిమిషం ఊరుకొని మంత్రి కోరినట్లు వాగ్దానం చేశాడు.

"ఇది కాశ్మీరాధీశ్వరులఆజ్ఞ!" అన్నాడు మహామాత్యుడు.

"నిజమేనా?"

"నిజమే! మరి మీరు నాకిచ్చిన మాట తప్పకూడదు!" అన్నాడు మంత్రి

గోపాలవర్మ రెండు చేతులతోను తల పట్టుకుని అలాగే కూర్చుండిపోయాడు.

తరవాత మెల్లిగా తలపైకెత్తి మంత్రికేసి చూసి—

"ఇంతటి దురంతాలకు కారణం?" అన్నాడు.

"కోశాగారంలో ధనాభావమే"

"మా పితామహులు కుదువ చేసిన ధనరాసులన్నీ ఏమైపోయాయో?"

"తమరలాగ ప్రశ్నిస్తే నేనేమి చెప్పగలను?" అన్నాడు మంత్రి.

తిరిగీ యువరాజు రెండు చేతులతోనూ తల పట్టుకొన్నాడు.

"దీనిలో మీ రింతగా మథనపడవలసిందేమీ లేదు. రాజధర్మమే అట్టిది!" అన్నాడు మంత్రి యాదాలాభంగా.

గోపాలవర్మ ఒక పెద్ద నిట్టూర్పు విడిచి పెటి మంత్రి దగ్గర సెలవు తీసుకు నేమాటకూడా మరిచిపోయి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. అలాగ నాలుగడుగులు వేసి తిరిగీ పంచకల్యాణిమీద కూర్చున్నంతవరకు అతనికి శరీరంమీద స్పృహ లేదు!

## ౨

గోపాలవర్మ రాజప్రాసాదానికి తిరిగి వచ్చివేసి జగదీశ్వరాలయ విషయంలో వేగులవారిని, కొందరు సన్నిహితులయిన రాజాధికారులను కలుసుకొని దేవాలయ వ్యవహారంలోనే కాక, కాశ్మీర రాజ్యపరిపాలనలో జరుగుతున్న దురంతాలెన్నెన్నో లోతుగా అవగాహన చేసుకున్నాడు. అవి వింటున్న కొద్దీ అతని హృదయం [illegible] పోయింది.

కాశ్మీరచక్రవర్తి శంకరవర్మ పరిపాలన ప్రారంభంలో కాశ్మీరరాజ్య ప్రాభవ వైభవాలు భారతవర్షంలో అంతటా ప్రతిధ్వనించాయి.

గోపాలవర్మ అప్పటికింకా చాలా చిన్నవాడు. అయినా పౌరజానపదులు శంకరవర్మయెడల చూపే భక్తిప్రపత్తులు, గౌరవాదరాలు గోపాలవర్మకు ఇంకా బాగా జ్ఞాపకం ఉన్నాయి. అతని పితామహుడు అవంతివర్మ మహాధర్మాత్ముడని ప్రసిద్ధికెక్కిన మహితాత్ముడు. అతని తరవాత రాజ్యానికి వచ్చిన శంకరవర్మ ధర్మపాలనలో అవంతివర్మను కూడా అతిక్రమించివేస్తున్నాడని ఆనాడు ప్రజలనేకవిధాలుగా ప్రశంసించేవారు. చాలాకాలం గడచినా ఆ విషయాలన్నీ గోపాలవర్మకు ఇటీవలే జరిగినట్లున్నాయి.

కాని క్రమక్రమంగా కాశ్మీరాధీశ్వరుడు శంకరవర్మ హృదయంలో విపరీతమైన ధనలోభం బయలుదేరింది. కొన్ని కొన్ని దుర్వ్యసనాలేవో అలవడ్డాయనికూడా ప్రజలు గుసగుసలాడుకొనేవారు. అవేవీ పైపైకి అంత స్పష్టంగా కనిపించకపోయినా భయంకరమైన ధనలోభము, దానివలన ఏర్పడిన క్రౌర్యము అతనిలోలోపల బాగా పెచ్చుపెరిగిపోయాయి. తనతండ్రి హృదయంలో బయలుదేరిన క్రౌర్యప్రవృత్తి గోపాలవర్మకు తెలిసినప్పుడు అతని హృదయం ఎంతో అలమటించిపోయేది. తండ్రిహృదయంలో హఠాత్తుగా బయలుదేరిన ఈ పాశవిక క్రౌర్యప్రవృత్తికి కారణమేమా అని లోలోపల అతడెంతో మథనపడుతూండేవాడు.

క్రమక్రమంగా శంకరవర్మ హృదయంలో క్రౌర్యంతోబాటు ప్రజలను పీడించే దుష్టప్రవృత్తికూడా బాగా మితిమీరిపోయింది. అవంతివర్మ తన ఆస్థానంలో ప్రతిష్ఠించిన ప్రసిద్ధకవీశ్వరులందరికీ దేవిడీమన్నాలు జరిగిపోయాయి. వారందరు మరి వేరే గత్యంతరం లేక శ్రీనగర రాజవీథులలో యాయవారము మొదలైన నీచవృత్తు లవలంబించి జీవితాలు వెళ్ళ

RATNAM'S 'N' OIL

సేవించిన పూర్తి సంతోష సౌఖ్యము లనుభవించగలరు.

1 సీసా రూ. 11-4-0.

ఎడ్రెస్సుతో జాబు వ్రాయండి.

డాక్టర్. రత్నం సన్స్,

మలకపేట బిల్డింగ్స్, హైదరాబాదు - 2.

# రాజ్యాంతే నరకం ధ్రువం!

బిచ్చుకుంటున్నారు. ఇంతేకాక కృషి వాణిజ్యాది వృత్తులతో జీవించేవారి వరుమానాలపై విపరీతమైన పన్నుల భారాలు విధించి వారందరినీ పీల్చి పిప్పిచెయ్యడం మొదలుపెట్టాడు. ఈ క్రూర పరిపాలనతో క్రమక్రమంగా కాశ్మీర ప్రజానీకంలో హాహాకారాలు చెలరేగాయి. రాజకోశాగారంలో ధనలోపం వల్లనే ఇలాంటి పరిస్థితులేర్పడుతున్నాయేమోనని గోపాలవర్మ భావించేవాడు. కొంతకాలంపాటు ఆ దుష్పరిపాలన కంతటికీ మహామాత్యుని క్రౌర్యమే కారణమని అతదూహించేవాడు. ఆపైన బందిపోటు దొంగలమూకతో శ్రీనగరంలో ప్రసిద్ధ దేవాలయాలుకూడా కొల్లగొట్టించే భీషణ క్రౌర్యం కూడా బయటపడిపోయింది. దీనికి వెంటనే ప్రతీకారం జరిపించకపోతే క్రమక్రమంగా ప్రజల్లో విద్వేషాగ్ని చెలరేగగలదని గోపాలవర్మకెంతో భయం వేసింది. విద్వేషాగ్ని మాట అటుంచినా ఆ అధర్మ పరిపాలన తలుచుకుంటే గోపాలవర్మ హృదయం దహించుకుపోయింది.

ఇది ఎలాగో అలాగ అరికట్టి తీరాలనీ కాశ్మీరంలో తిరిగీ అవంతివర్మ కాలంనాటి ధర్మ పరిపాలన నెలకొల్పించాలనీ గోపాలవర్మ నిశ్చయించుకొన్నాడు. ఒకసారి తండ్రిగారితో ఆ విషయాలన్నీ ముఖతః ప్రసంగించాలని నిశ్చయించుకొన్నాడు. అంతమాత్రంచేత ఆయన తన క్రూర ప్రవృత్తి మానివేసే అవకాశం కలగదేమోనని అతని అనుమానం. ఏమైనా ఇది సాధించి తీరాలనే దృఢనిశ్చయం కూడా వెంటనే గోపాలవర్మలో బాగా బలపడిపోయింది. అంతలోనే అతనికొక వరప్రదానవిషయం స్ఫురణకు వచ్చింది. దానితో తప్పకుండా తన కార్యం సాధించుకోవచ్చునని గోపాలవర్మ లోలోపల ఎంతో మురిసిపోయాడు. ఆవర ప్రదానవిషయం ఇది:

ఒకనాడు గోపాలవర్మ శంకర వర్మతో కలిసి కాశ్మీర పరిసరారణ్యంలో మృగయావినోదం చూడడానికి వెళ్లాడు. ఆ మృగయా వినోదంలో గోపాలవర్మ పాల్గొనలేదు. కాశ్మీర మహారాజు శంకరవర్మ పరిజనులతో కలిసి అరణ్యంలో వేటాడుతున్నాడు. వేట తమకంలో ఎవరూ వెనకచూపులేకుండా ముమ్మరంగుకుసాగిపోతున్నారు. ఆనాడు శంకరవర్మ ఎన్నెన్నో క్రూరజంతువులను సంహారించివేశాడు. అంతలోనే ఒక చిరుతపులి అమాంతంగా వెనకనించి ఎగిరివచ్చి శంకరవర్మ మీదికి లంఘించింది.

కనురెప్పపాటులో అది శంకరవర్మ కంఠం చీల్చి వేసేదే! కాని ఆ వెనకనే నిలుచున్న గోపాలవర్మ ఒక్క బల్లెంపోటుతో దానిని అక్కడే కూల్చివేశాడు. శంకరవర్మ దానికెంతో సంతోషించి గోపాలవర్మతో—

"నాయనా! నీకేమి వరం కావాలో కోరుకో!" అన్నాడు.

గోపాలవర్మ ఆ వరం అవసరం వచ్చినప్పుడు స్వీకరిస్తానని అన్నాడు. శంకరవర్మ అతని దూరదృష్టికి మరింత సంతోషించాడు. అది జరిగి అప్పుడే అయిదారు నెలలయిపోయింది. ఆ వరంనే ఉపయోగించుకోవలెనని గోపాలవర్మ నిశ్చయించుకొన్నాడు. పైగా అది గోపాలవర్మ జన్మదినం కూడాను. అందుచేత తండ్రి తప్పక తనకోరిక నెరవేర్చవచ్చునని అతని ఆశ. ఆ వరప్రదానం చెయ్యకుండా తప్పించుకుపోవడానికిక మార్గాంతరమేమీ లేదు. ఆ ఆనందంతో ఉప్పొంగిపోతూ గోపాలవర్మ నెమ్మదిగా శంకరవర్మ ప్రాసాదానికి బయలుదేరాడు.

దారిలో అతనికి శ్రీనగరం అంతా బీదప్రజ దీనవచనాలతో పాడుపడిపోయినట్టు కనబడింది. ఆ దీనదరిద్రుల దైన్య జీవితం చూచేసరికి అప్రయత్నంగా అతని కళ్లమ్మట వేడివేడి కన్నీటిధారలు ప్రవహించాయి.

అతడు రాజభవనం సమీపించేసరికి రెండుఝాములయింది. ఆనాడు గోపాలవర్మ


జి. ఎస్. ఎఫ్. కొల్లేగాల్




పట్టు చీరలోవున్న విశిష్టతను తెలుసుకోండి



ప్రసిద్ధ 'ఆటోవుజ్స్'లో పురి ఎక్కించిన మేలిరకం ఫిలేచర్ సిల్కును, వస్త్రాల ఉత్పత్తిలో వాడటం వలన, జి. ఎస్. ఎఫ్., కొల్లేగాల్ సిల్కువస్త్రాలు అందంలోను నేతలోను, అతి సున్నితంగా తయారవుతవి.

★

గవర్నమెంటు సిల్కు ఫిలేచర్సు,
కొల్లేగాల్,

మద్రాసు, పరిశ్రమల మరియు వాణిజ్యశాఖలోని ఒక విభాగము.

# 28-3-56 తేదీన ప్రారంభం

## బాలసాహితి కొత్త సీరియల్

# సాగరగర్భంలో సాహసయాత్ర

### ఉత్సాహోద్రేకాలు, వినోదవిజ్ఞానాలు కలిగించే
### విచిత్ర వైజ్ఞానిక నవల

ఫ్రెంచి రచయిత జూల్స్ వెర్న్ రచించిన "ట్వెంటీ థౌజండ్ లీగ్స్ అండర్ ది సీ" నవల అనువాదంగా "సాగరగర్భంలో సాహసయాత్ర" అనే కొత్త సీరియల్ ఆంధ్ర వారపత్రిక బాలసాహితి శీర్షికలో పైవారం నుండి ప్రచురిస్తున్నాము.

**వారంవారం ఆంధ్రవారపత్రికలో ఈసీరియల్ చదివి ఆనందించండి.**


జన్మదినోత్సవం కావడంవల్ల కాశ్మీర మహారాజు శంకరవర్మ సుఖంగా సింహాసనం మీద కూర్చుని అత్యంతాప్తులయిన నలుగురయిదుగురు రాజబంధువులతో ఇష్టాగోష్ఠి జరుపుతూ ఎంతో ఉల్లాసంగా ఉన్నాడు. కొంచెం దూరంగా నలుగురైదుగురు విట విదూషకులు కూర్చున్నారు. తమలోతామే వేవో ఛలోక్తులు విసురుకొంటున్నారు.

యువరాజు లోపలికి ప్రవేశించేసరికి విట విదూషకులంతా శంకరవర్మకు కొంచెం దూరంగావెళ్లి కూర్చున్నారు. వెంటనే తమ తమ ఛలోక్తులు కూడా కట్టిపెట్టివేశారు.

శంకరవర్మ అతన్ని చూస్తూనే ఎంతో ఆప్యాయంగా సరసన కూర్చోబెట్టుకొని—

"ఏం పంచకల్యాణి బాగున్నదా ?" అన్నాడు. అది శంకరవర్మ కుమారునికి జన్మదినోత్సవం కానుకగా బహూకరించిన ఉత్తమాశ్వం. ఆ విషయం గోపాలవర్మకు హఠాత్తుగా స్ఫురించింది.

"అవునవును! చాలా చక్కని ఉత్తమాశ్వం!" అన్నాడు గోపాలవర్మ కొంచెం కంగారుగా.

శంకరవర్మ అతని ధోరణి పసికట్టివేశాడు. అతడు జన్మదినోత్సవంనాడావిధంగా నిరుత్సాహంగా ఉండడానికి కారణమేమో అతనికి బోధపడలేదు. ఎంతో ఆప్యాయంగా దగ్గరకు పిలిచి దానికి కారణమేమని అడిగాడు. గోపాలవర్మ ఎంతో వినయవిధేయతలతో అతనికి ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"మీరు నా కొక వరం ప్రసాదిస్తామన్నారు! జ్ఞాపకం ఉన్నదా ?"

"లేకేమి !"

"నే నావరం ఈనాడు కోరుకుంటున్నాను."

శంకరవర్మకు లోలోపల కొంచెం అనుమానం తగిలింది. అయినా అది పైకి కనబడనీయలేదు :

"ఓ! అలాగే కోరుకోవచ్చును! దానికేమి! ఈవేళ జన్మదినోత్సవం కదా !"

గోపాలవర్మ తిరిగి ఎంతో వినయంగా—

"తప్పకుండా నేను కోరుకున్న వరం అనుగ్రహించాలి." అన్నాడు.

శంకరవర్మకు దీనితో అనుమానం బాగా దృఢపడింది :

"ఏమిటావరం !" అన్నాడు.

గోపాలవర్మ మొదట కొంచెం తటపటాయించాడు. తరవాత కాశ్మీర ప్రజ అధర్మ పరిపాలకుల పదాఘాతం కింద పడి సతమతమైపోతున్నదనీ ఇటువంటి అధర్మపరిపాలన పూర్వకాలంలో ఎన్నడు కనీవినీ ఎరగమని ప్రజలంతా వాపోతున్నారనీ తిరిగి పితామహులు అవంతివర్మకాలంనాటి ధర్మపరిపాలన ప్రతిష్ఠించవలసినదనీ అదే తన వరమనీ గోపాలవర్మ ఎంతో వినయపూర్వకంగా విన్నవించాడు.

మహారాజామాట విని ఒక్కసారిగా విరగబడి నవ్వాడు.

అదిచూచి 'ఎంత విషపు నవ్వో!' అనుకున్నాడు గోపాలవర్మ.

కనుబొమ్మలు కలిసిపోయి ఒకే నీలరేఖగా స్ఫురించే శంకరవర్మ ముఖకవళికలో ఆ విషం అంతా మూర్తీభవించినట్లు స్ఫురించింది.

తరవాత కాశ్మీరాధీశ్వరుని ముఖంలో ఆ నవ్వంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయింది. వెంటనే కొంత విషాదచ్ఛాయ గోచరించింది. తన కుమారుడే ఆవిధంగా తన పరిపాలన నిందించేసరికి అతని నెవరో వెనకనించి ఒక్కసారిగా వాడిశూలంతో పొడిచి

(54-వ పేజీ చూడండి)

# ★ రాజ్యాంతే నరకం ధ్రువం! ★

(11-వ పేజీ తరువాయి)

వట్లయింది 'ఇదంతా ఎవరికోసం? తనకోసమే గదా!' అనుకున్నాడు శంకరవర్మ. పిమ్మట ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచి గోపాలవర్మతో ఇలాగన్నాడు:

"ఈ రాజ్యాధికారం చేపటక పూర్వం మీ పితామహుల చేతిలో నేనెన్ని కష్టాలనుభవించానో నీ వెరుగుదువా?"

"నేనెరగనే! నాకేమీ తెలియదే!"

"అయితే చెబుతున్నాను. విను! ఒకసారి ఆయన వేటాడుతూ తానెక్కిన అశ్వం వెనువెంటనే పరుగెత్తమని నాకాజ్ఞాపించారు. కాళ్ళకు పాదరక్షలైనా లేకుండా ఆ అశ్వం వెంట వెంట పరుగులు పెట్టాను! నా పాదాలంట రక్తధారలు ప్రవహించాయి!"

గోపాలవర్మ విస్తుపోయి—

"ఎందుకంతటి క్రౌర్యం?" అన్నాడు.

శంకరవర్మ మళ్లీ మొదలుపెట్టాడు.

"అదే చెబుతున్నాను. శ్రద్ధగా విను! వేళ్ళు కొంకరపోయే తీవ్రశిశిరంలో నాచేత సన్నని వస్త్రాలు ధరింపజేసేవారు! మండు వేసంగిలో దట్టమైన ఉన్ని వస్త్రాలు ధరింపజేసేవారు! ఇలాగ నేనెన్నో యమయాతనలు అనుభవించాను. తెలిసిందా?"

"దీనికి కారణం?"

"అప్పటి మహామాత్యులొకసారి మీ పితామహుల నీవిధంగానే ప్రశ్నించారు. దానికాయన ఇచ్చిన సమాధానమేమో విన్నావా?"

గోపాలవర్మ వినలేదన్నట్లుగా అతనికేసి చూచాడు.

శంకరవర్మ తిరిగీ ప్రారంభించాడు:

"మహామాత్యునితో మీ పితామహులేమన్నారో కొంచెం విను! ఆగర్భ శ్రీమంతులకు క్షుద్రదరిద్రుల కష్టసుఖాలు తెలియవు! రాజ్యాధికారం చేజిక్కిన తరవాత అవి జ్ఞప్తికి రావాలనే దృష్టితో నే నీవిధంగా నా కుమారునికి దుఃఖానుభూతి కలిగిస్తున్నాను. అన్నారాయన!"

"ఎంతటి నిశితమైన అసిధారా శిక్షణ!" అన్నాడు గోపాలవర్మ.

పిమ్మట ఒక్క నిమిషంవరకు శంకరవర్మ ఏమీ అనకుండా రెప్పపాటు లేకుండా కుమారుని ముఖం పరిశీలించాడు. గోపాలవర్మకూడా అలాగే రెప్పపాటు లేకుండా శంకరవర్మ ముఖంకేసి చూచాడు.

"అవిఘ్నంగా కష్టసుఖాలు చవిచూచినా కొంతకాలం రాజ్యపరిపాలనం సాగించేసరికి నాలో కారుణ్యం లేశమైనా మిగిలకుండా పూర్తిగా నశించిపోయింది. కాని బాల్యంలో నేను నీవలెనే ప్రజలకష్టాలు చూచి ఎన్నెన్నోమారులు కన్నీరు విడిచిపెట్టాను. కాని క్రమక్రమంగా నా హృదయం కఠినశిలగా మారిపోయింది నీ వన్నట్టు నాది క్రూరపరిపాలనమే అయితే ఇంతకంటె గత్యంతరం లేదు!"

గోపాలవర్మ కాయన హృదయం క్షోభపిశాచావిష్టమైపోయినదనీ అంగవల్లనే ఆ విధంగా ప్రసంగిస్తున్నాడనీ అనుకొన్నాడు. అయినా నిరుత్సాహపడక—

"మరి పితామహులీ విధంగానే పరిపాలించారా?" అని ప్రశ్నించాడు.

"అప్పటి కాలమాన పరిస్థితులు, అప్పటి ప్రజ వేరు!" అన్నాడు శంకరవర్మ.

ఆ పైన అతడేమీ మాట్లాడకుండా గాఢంగా ఏదో ఆలోచించాడు. తరవాత గోపాలవర్మ ఒక్క క్షణంపాటు మాట్లాడ కూరకుని తన ప్రార్థన మన్నించి, వాగ్దానం చేసినట్టుగా వరప్రదానం చెయ్యవలసిందని ప్రబతిమాలుకొన్నాడు.

పిమ్మట శంకరవర్మ తిరిగీ అలాగే వికటాట్టహాసం చేశాడు. దానికి దూరదూరంగా కూర్చున్న విటవిదూషకుల నవ్వులుకూడా తోడైనాయి.

శంకరవర్మ అంతలోనే తన నవ్వాపి కుమారునికేసి నిశితంగా చూసి—

"సరే! నీవు కోరినట్టుగానే నీకు వరప్రదానం చేస్తున్నాను నీవుకూడా నాకొక వరప్రదానం చేస్తావా?" అన్నాడు.

"నేనా? వరప్రదానమా?"

"అవును నీవే!" అన్నాడు శంకరవర్మ.

"నేను మీకు వరప్రదానం చెయ్యగలనా?"

"చెయ్యగలవు!"

"అయితే అలాగే!" అన్నాడు గోపాలవర్మ.

శంకరవర్మ ఒక్క నిమిషం గుంభనగా మాట్లాడ కూరకుని—

"నా అనంతరం నీవు రాజ్యాధికారానికి వచ్చిన తరవాత నా కంటె ఎక్కువ క్రౌర్యం వహించనని వాగ్దానం చెయ్యాలి! అదే నే నడిగే వరం! నాకది చాలు!" అన్నాడు.

అటు పిమ్మట శంకరవర్మ తిరిగీ ఉవ్వెత్తుగా విరగబడి నవ్వడం మొదలు పెట్టాడు. దానితో బాటు విటవిదూషకులుకూడా అదే పనిగా విరగబడి నవ్వడం ప్రారంభించారు.

ఆ అవహేళనతో గోపాలవర్మ కన్నులలో రక్తం ప్రవహించింది. విటవిదూషకుల దగ్గిరికి వెళ్ళి ఒళ్లెరగని క్రోధంతో—

"ఎందుకలా నవ్వుతున్నారు! మీరు మానవులా? పశువులా?" అని దూషించాడు గోపాలవర్మ.

వారిలో ఒక విదూషకుడు వెటకారంగా కన్నెగరవేసి శంకరవర్మవైపు తిరిగి—

"మహాప్రభూ! పశువులు నవ్వవు! మానవులే నవ్వేది!" అన్నాడు. ఆ మాటతో మళ్ళీ సభలో కలకలహాసం చెలరేగింది!

గోపాలవర్మ ఉగ్రుడైపోయాడు: "ప్రస్తుత పాశవిక పరిపాలనలో మానవుల ముఖాల్లో నవ్వులు నశించిపోయాయి! ఇక పశువులే నవ్వగలిగేవి!"—అన్నాడు.

దీనితో సభలోనివారంతా పిడుగు మొత్తినట్లుగా స్తంభించిపోయారు. శంకరవర్మ ముఖం జేవురించింది. అయినా అతడేమీ అనలేక తలవంచుకొని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. వెంటనే గోపాలవర్మ సాధిక్షేపంగా సభ్యుల ముఖాలు పరిశీలిస్తూ కనురెప్పపాటులో ఆ భవనంలోనించి వెళ్ళిపోయాడు.

## 3

అటుపిమ్మట క్రమక్రమంగా ఒక సంవత్సరం గడిచిపోయింది. ఆ సమయంలో శంకరవర్మ, గోపాలవర్మ క్రమక్రమంగా ఒకరొకరికి దూరులైపోయారు. ఎప్పుడో గాని పరస్పర ముఖావలోకనాలే జరిగేవి కావు. ఆపిమ్మట శంకరవర్మ క్రూరపరిపాలనలో అంతగా మార్పేమీ గోచరించలేదు. అయితే అతని పేరు చెబితేనే శత్రువుల గుండెలు దద్దరిల్లిపోయేవి. అనంతరం అతడెన్నెన్నో దండయాత్రలు చేసి కాశ్మీర రాజ్య ప్రాభవం నాలుగుమూలలా విస్తరింపజేశాడు. అయితే కాశ్మీర ప్రాభవ విస్తరణతో బాటు ప్రజలలోను, చతురంగ సైన్యంలోను అసంతృప్తి, విద్వేషాగ్ని కూడా బాగా పెచ్చుపెరిగిపోయాయి.

తరవాత కొంత కాలానికి శంకరవర్మ తన అపార సేనావాహినితో సింధునదీతర రాజన్యుల దర్పం అణిచివేసి వారందరినీ కాశ్మీర సామంతులుగా మార్చివేశాడు. ఉరశాపురంలో కాశ్మీర సైన్యంలో కొంత విప్లవాగ్ని చెలరేగిందనే వార్తలు శ్రీనగరంలో వ్యాపించాయి గాని, క్రమంగా అవ్వన్నీ అంతరించిపోయాయి. శంకరవర్మ ఆ దిగ్విజయం ముగించుకొని తిరిగీ శ్రీనగరానికి వచ్చివేస్తున్నాడని వేగరులు కొందరు కొన్ని వార్తలు చేరవేశారు.

ఆ వేళ బాగా చీకటిపడింది. ఒక వార్తాహారుడు నురగలు కక్కుకుంటూ వచ్చి గోపాలవర్మతో కాశ్మీర మహారాజు శ్రీనగర సింహద్వారం దాటి నగరంలో ప్రవేశించారనే వార్త అందించాడు

గోపాలవర్మకు తండ్రి అధర్మ పరిపాలన ఎడల ఎంతటి వైముఖ్యం కలిగినా అతని బలపరాక్రమదక్షతలంటే ఎంతైనా గౌరవం. అదీగాక మహారాజు పురప్రవేశం చేస్తున్న

ప్పుడు యువరాజాతని కెదురేగడం మహారాజ మర్యాద.

గోపాలవర్మ తండ్రి బహూకరించిన పంచకల్యాణిపైకి లంఘించి ఒక్క క్షణంలో శ్రీనగర సింహద్వారం చేరుకొన్నాడు.

ఒక పెద్ద పట్టపుటేనుగుపై అధిరోహించి శంకరవర్మ మెల్లిమెల్లిగా నగరంలో ప్రవేశిస్తున్నాడు. అతని వెనువెంట అపారమైన కాశ్మీర సేనాసముద్రం. శ్రీనగర పౌరులు దిక్కులు పిక్కటిల్లేటట్టు జయ జయ ధ్వానాలు చేస్తున్నారు. వేలాది కరదీపికలతో ఆనాడు శ్రీనగర రాజవీథులలో పండు వెన్నెలలే వెల్లివిరిశాయి.

శంకరవర్మ అధిరోహించిన మత్తగజం నెమ్మదిగా ఆగింది. యువరాజా ప్రదేశానికి చేరుకోగానే తిరిగీ పౌరుల జయ జయ ధ్వానాలు మిన్ను ముట్టాయి. శంకరవర్మ మెల్లిగా శిరఃకంపంచేస్తూ చేతులెత్తి నమస్కరిస్తూ పౌరుల అభినందన పరంపర లందుకొంటున్నాడు. గోపాలవర్మ నెమ్మదిగా పట్టపుటేనుగుపై అంబారీలో ప్రవేశించాడు. దానిలో మహామాత్యుడు, కాశ్మీర చక్రవర్తి శంకరవర్మ మాత్రమే కనిపించారు.

గోపాలవర్మ సవినయంగా జనకునికి నమస్కరించాడు. శంకరవర్మ శిరఃకంపం చేశాడు.

గోపాలవర్మకు ఆ శిరఃకంపం అపూర్వంగా కనిపించింది. ఎంతో పరిశీలనగా తండ్రి ముఖకవళిక పరిశీలించాడు. ఆ ముఖంలో జీవకళ లేదు! అది మృతదేహం! గోపాలవర్మ నిర్ఘాంత పడిపోయి అదేమని మహామాత్యుణ్ణి ప్రశ్నించాడు. మహామాత్యుడు చెయ్యెత్తి మాట్లాడవద్దని నెమ్మదిగా సంజ్ఞ చేస్తూ అతనితో ఇలాగన్నాడు.

"మహాప్రభూ! మీ రిప్పుడు గుండె రాయి చేసుకొని ధైర్యం చిక్కబట్టాలి. శంకరవర్మ చక్రవర్తి మరణించి అప్పుడే రెండు రోజులయింది. ఉరశాపురంలో సైనికులు కొందరు తిరుగుబాటు చేశారు. చక్రవర్తి ఆ తిరుగుబాటంతా అణచివేశారు. కాని పర్వతం చరియపై పొంచి కూర్చున్న శబరయోధుడొకడు విషదిగ్ధమైన బాణం చక్రవర్తిపై ప్రయోగించాడు. అది తగిలిన కొన్ని గడియలలోనే చక్రవర్తి స్వర్గస్థులైనారు. వెంటనే సైన్యంలో విప్లవాగ్ని చెలరేగితే కాశ్మీర రాజ్యానికే ముప్పు వాటిల్ల గలదనే భయంతో మే మొక ఉపాయం ఆలోచించాము. మహారాజు స్వర్గస్థులయినా సైనికుల కెవరికీ అది తెలియనీయలేదు! ఆయన సజీవులే అన్నట్టుగా సైన్యంలో అందరికీ భ్రమ కలిగించాము. శిరస్సుకు, హస్తాలకు చిన్నచిన్న తాళ్లు కట్టి ముందు వెనకలకు కదలాడేటట్లు ఏర్పాటు చేశాము. అందువల్లనే చక్రవర్తి స్వయంగా ప్రజాభివందనా లందుకుంటూ నమస్కరిస్తున్నట్లుగా మీ కందరికీ స్ఫురించింది. ఈ ఉపాయంవల్లనే కాశ్మీరసైన్యం శ్రీనగరంలో ప్రవేశించే వరకు తీవ్ర విప్లవం చెలరేగకుండా జాగ్రత్త పడ్డాము. ఇది చక్రవర్తికి మహాపచారమే కాగలదని మాకు తెలియకపోలేదు. కాని కాశ్మీర రాజ్యసంరక్షణ దృష్టితో చేసిన ఈ అపచారం మన్నించవలసిందని మిమ్మల్ని సవినయంగా ప్రార్థిస్తున్నాము."

అదంతా గోపాలవర్మకొక వజ్రాఘాతంలా తగిలింది.

మొదట అతడది నమ్మలేదు! తిరిగి జనకుని ముఖం పరీక్షగా పరిశీలించాడు. నిజమే! అది ప్రేతదేహమే! సందేహంలేదు! మహామాత్యుడు తన గుప్పెట బిగించిన చిన్నచిన్న తాళ్లతో శంకరవర్మ శిరస్సు, హస్తాలు కదిలాడేటట్లు చేస్తున్నాడు! అప్పుడిక ఉద్వేగపడడంవల్ల ప్రయోజనమేమీ లేదని గోపాలవర్మ మారు మాటాడకుండా అలాగే జనకుని ముఖం పరిశీలిస్తూ ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. అతని చెంపలవెంట వేడి కన్నీరు సంతతధారగా ప్రవహించింది!

ఎంతటి ధైర్యశాలి కెంతటి దారుణ మరణం సంభవించింది! ఎంతటి కరుణార్ద్రహృదయుడు ధనలోభావిష్టుడై ఎంతటి కఠినహృదయుడుగా మారిపోయాడు! అని అనుకొన్నాడు గోపాలవర్మ. ఎంతటి కరుణాళువులైనా కర్కశ రాజ్యాధికారం చేజిక్కించుకోగానే ఇలాగే మారిపోతారేమోనని అతనికి హఠాత్తుగా స్ఫురించింది.

సంతతధారగా ప్రవహించే కన్నీటిమధ్య నించి శంకరవర్మ ముఖం పరిశీలిస్తున్న గోపాలవర్మ హృదయంలో ఆ భావం స్థిర స్వరూపం ధరించింది.

కాశ్మీర చక్రవర్తి శంకరవర్మ మృతదేహము, యువరాజు గోపాలవర్మ, మహామాత్యుడు అధిష్ఠించిన ఆ పట్టపుటేనుగు అల్లాగే మెల్లిమెల్లిగా శ్రీనగర రాజవీధులగుండా సాగిపోయింది. ఆ దృశ్యం అంతా నిశ్చల దృష్టితో పరిశీలిస్తున్న కాశ్మీర యువరాజు గోపాలవర్మ పెదవులనుండి అప్రయత్నంగా "రాజ్యాంతే నరకం ధ్రువం!" అన్న దేవవాణీసూక్తి అస్పష్టంగా పైకి వెలువడింది. ★

## జీవన ఫలం

(40 వ పేజీ తరువాయి)

తగినంత ప్రచారం లేనప్పుడు
తప్పుడు పనులుచేసేవారితో భుజంకలపరు
వేటగాడు జంటపిట్టలని కొట్టేవరకూ
ఆ సంఘటనని ముందుగా తలంచరు
కొట్టిన పిదప శోకించుతారు
శోకించుతారు
కీడెంచి మేలెంచమన్నా
చూడలేరు రానున్న ఈ ప్రమాదాన్ని విపత్తుని

యువ: ఎవరిది లోపం కాంతీ
ఈ అరాచకం ఎవరి దోషం
కాంతి: మనదే మనదే
కనబడలేదా మనం చేసిన తప్పులు
సందేహజీవుల మనస్సులలో
సంచలనం కలిగినప్పుడు సమాధాన చెప్పలేదు
యువ: నిజం ఓదార్చలేదు
కాంతి: న్యాయం నగుమోముకి తగిలిన
గాయాలే మానెనుగాని
మాయని పెనుమచ్చలు మిగిలెను
పోయిన తొలి కాంతులు మరలవు
యువ: అవును మరల మరల మరలవు
కాంతి: విలాసాన్ని వైరి వేషాలని నిషేధిస్తున్నామని
వినోదాన్ని నిషేధించాం మనం
యువ: అవును విశేషించి కావేషం పెంచాము
కాంతి: లక్ష్యశుద్ధి లేకుండా అసలు లక్ష్యమే లేకుండా
తిరుగుబాటు కొరకే తిరగబడుతున్నారందరూ
గమ్యస్థాన మొకటి నిర్దేశించి ఆశయముపదేశించి
మార్గం సుగమ్యం చేయలేదు మనం
యువ: తత్వానికి తలవొగ్గమన్నాము
మనవైపే మొగ్గమన్నాము
అభిప్రాయభేదం అనంగీకరించమన్నాము
ఆజ్ఞలు శిరసావహించమన్నాము
కాంతి: ఆలోచనలలో వైవిధ్యాన్ని
బహిరంగ వైరుధ్యం గావించాము
వంచినతల ఎత్తినవారిని
పంచమహాపాపు లన్నాము
యువ: వ్యక్తిత్వాలు విసర్జించమని సమష్టిని
దుష్టశక్తిగా రూపొందించాము
కాంతి: అధినేతలలో అధికారవాంఛ ప్రబలినప్పుడు
అనుచరులు నిశాచరులు కాకతప్పదు
యువ. యౌవన దీపం ఉండగానే
జీవితపుటిల్లు చక్కబెట్టుకొందామని
నేడే రేపుగా కోరిక లీడేరే తలంపుతో
మందకొడి జీవితాన్ని వదిలి
మందలో కలిసిపోతారు మందులు
మృత్పిండమ్ములవలె పైకెగరలేరు
క్రిందంబడి వుంటారు
కాంతి: లోకమందలి మంచి చెడ్డలు
లోకు లేకారణముచేతనో ఎరుగలేరు